క్లుప్తంగా

కేజీబీవీ పరిశీలన



వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈవో

జి.సిగడాం : మండల కేంద్రం జి.సిగడాంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణ కిరీటానికి వితరణ



విరాళం అందిస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వెంకటేశ్వరస్వామికి స్వర్ణకిరీటం నిమిత్తం డి.మధుసూదనరావు, లక్ష్మి దంపతులు రూ.10,116, జి.ఎస్.ఆర్ గుప్తా, కామేశ్వరి దంపతులు రూ.10వేలు, దవిలి మిహిరాన్ కార్తికేయ రూ.10వేలు, కె.వెంకటరావు, జయలక్ష్మి దంపతులు రూ.10వేలు, సాయి అశ్వంత్, నైనిష దంపతులు రూ.10వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు గోపాలాచార్యులు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి.

విద్యార్థులకు అభినందనలు



బహుమతులతో విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి ఐఎన్‌టీఎస్‌ఓ అసెస్మెంట్ టెస్ట్ ఒలింపియాడ్ లెవెల్–2లో బలగ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ వి.ఇంద్రమౌళి తెలిపారు. 4వ తరగతి నుంచి పైల సాత్విక్ గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్‌టాప్, 7వ తరగతి నుంచి తంగి హర్షవర్ధన్ ప్రథమ బహుమతిగా ట్యాబ్, గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్స్ మరో 196 మంది సత్తాచాటారని కొనియాడారు. శనివారం వీరిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రీజినల్ ఇన్‌చార్జి శీపాన రామినాయుడు, ఏజీఎం సురేష్, కో–ఆర్డినేటర్ బాలరాజు, డీన్ జగదీష్, అసిస్టెంట్ డీన్ రామ్మోహన్, మల్లేశ్వరరావు, ఉషారాణి, రామన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత



జ్యోతికి పర్సు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్ : కొత్తూరు మండలం కుంటిబద్ర గ్రామానికి చెందిన జి.జ్యోతి అనే ప్రయాణికురాలు శనివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని బెంచీపై పర్సు మర్చిపోయి వెళ్లిపోయారు. అటుగా వచ్చిన ఆర్టీసీ ఏడీసీ రవిబాబుకు పర్సు గమనించి చుట్టుపక్కల ఆరా తీశారు. వారంతా తమది కాదని చెప్పడంతో స్టేషన్ మాస్టర్ ఎంపీ రావుకు విషయం వివరించి పర్సు అందజేశారు. అందులో రూ.8400 నగదు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు కాగితం ఉన్నాయి. సంబంధిత ఫోన్ నంబరుకు ఫోన్ చేసి విషయం తెలియజేయగా జ్యోతి కాంప్లెక్స్‌కు చేరుకోవడంతో పర్సు అందజేశారు. దీంతో ఆమె ఆర్టీసీ ఎస్ఎం ఎంపీరావు, ఏడీసీ రవిబాబులకు కృతజ్ఞతలు తెలిపింది.

విత్తన శుద్ధితో.. అధిక దిగుబడులు

- తెగుళ్ల బెడదకు ముందుగానే చెక్
- సరైన మోతాదుల్లో మందుల వినియోగం అవసరం



విత్తన శుద్ధి చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల : ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ సమయంలో మార్కెట్‌లో దొరికే విత్తనాలను నేరుగా పొలంలో చల్లకుండా విత్తన శుద్ధి చేయాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భూమిని దున్నటం ఎంత ముఖ్యమో శుద్ధి చేసి విత్తనం వాడడం అంతే ప్రధానమని చెబుతున్నారు. ఏరువాక ప్రారంభమయ్యే సమయంలో రైతన్నలు విత్తన ఎంపికలో ఎంత జాగ్రత్త తీసుకుంటారో కొనుగోలు చేసిన విత్తనాలను శుద్ధిచేస్తే మేలైన పంట దిగుబడి సాధించవచ్చని అంటున్నారు.

విత్తన శుద్ధి ఇలా..

ప్రతి రైతు వరిసాగులో తెగుళ్ల బెడద ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు విత్తన శుద్ధి కార్యక్రమం గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్నారు. విత్తనం, నేల స్వభావం ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టేందుకు విత్తన శుద్ధి దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. 30 కిలోల విత్తనంలో 250 గ్రాముల సుడోమోషన్‌ను, 90 గ్రాముల కార్బండిజమ్‌ను కలిపి ఊరిన తరువాత పంట పొలాల్లో జల్లాలి. దీని ద్వారా అగ్గి తెగులు, పొడ తెగులు నివారించవచ్చు.

నారుమడులు సిద్ధం..

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు వరి సాగుకు అవసరమైన పనులు మొదలుపెట్టారు. నారుమడులను దుక్కులతో సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో వరిలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చు. నారు తీసే టప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చ రంగులో ఉంటే మొన త్వరంగా తిరుగుతుంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఎంచుకోవాలి. పైపైన నాట్లు వేస్తే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది. చదరపు మీటరుకు కనీసం 33 మొనలు ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు చొప్పున బాటలు ఏర్పాటుచేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా పైరుకు గాలి, వెలుతురు తగిలి తెగుళ్ల బెడద తగ్గుతుంది. ఎరువులు వేసేందుకు పురుగు మందులు, కలుపు మందులు, పిచికారీ చేసేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. నారుమడిలో లేత ఆకులు తెల్లబారినట్లు ఉంటే ఇనుము లోపంగా గుర్తించి నివారణకు లీటరు నీటికి 20 గ్రాములు అన్నబేధి, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

విత్తన శుద్ధితో పంటకు రక్ష



వరిలో తెగుళ్ల బెడద లేకుండా ఉండేందుకు విత్తన శుద్ధి దోహదపడుతుంది. రైతుకు ఖర్చు తగ్గుతుంది. ఇప్పటికే పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు.

– వావిలపల్లి రాజేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి, ఎచ్చెర్ల

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో యోగా చేస్తున్న పోలీసులు



శ్రీకాకుళం మహిళా కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎచ్చెర్ల/రణస్థలం/జి.సిగడాం/శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఎచ్చెర్ల జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో శనివారం జిల్లా పోలీసులు యోగాసనాలు వేశారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసులు ఉత్సాహంగా పాల్గొని యోగా చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలన అధికారి (ఏవో) సీహెచ్ గోపీనాథ్ మాట్లాడుతూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐ హరినాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రణస్థలం, జి.సిగడాం, లావేరు మండలాల్లోనూ యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

శ్రీకాకుళం నియోజకవర్గంలో..

శ్రీకాకుళం రూరల్ మండలం, గార, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విద్యాసంస్థలు, కార్యాలయాల ప్రాంగణాలు, మైదానాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి హెచ్ఎంలు/ప్రిన్సిపాళ్లు, టీచర్లు/లెక్చరర్లు యోగాసనాలు వేశారు. యోగా విశిష్టత, ప్రాధాన్యతను వివరించారు.

• తులసిమాల అలంకరణలో..



నగరంలోని చిన్నబజారులో దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పూలమాలలతో అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ప్రధానిని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎయిర్‌పోర్టులో మోదీకి స్వాగతం పలికినవారిలో ఈయన ఉన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

జి.సిగడాం: డి.ఆర్.వలస రైతుసేవా కేంద్రం వద్ద శనివారం రైతులకు రాయితీపై వివిధ రకాల వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమరాపు శాంతమ్మ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, మాజీ సర్పంచ్ కుమరాపు అప్పన్న, అగ్రికల్చర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం రూరల్ : ఈ నెల 23న నిర్వహించనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గుండ హరేష్ పిలుపునిచ్చారు. శనివారం ధర్మాన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళింగ కోమటి అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. నిరుద్యోగులకు రూ.3వేలు భృతి అందించకుండా మోసం చేసిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమానికి పెద్ద ఎత్తున యువత హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గార మండల ఎంపీపీ గొండు రఘురామ్, పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాసరావు, రౌతు శంకరరావు, పీస గోపి, రుప్ప అప్పలసూరి, తంగి అప్పన్న, ఊటపల్లి కృష్ణారావు, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూలిపోతున్నా కనికరం లేదాయె..!

- జిల్లా కేంద్రంలో శిథిలావస్థలో అర్చకుల క్వార్టర్స్
- పైకప్పు కూలిపోయి కారిపోతున్న భవనాలు
- పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు



పైకప్పు కూలి శిథిలావస్థకు చేరిన అర్చకుల నివాసాలు

శ్రీకాకుళం కల్చరల్ :

జిల్లా కేంద్రంలోని నాగావళి తీరంలో బలరామ ప్రతిష్ట క్షేత్రాలుగా భాసిల్లుతున్న పంచ లింగ క్షేత్రాలలో ఒకటైన ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకుల కోసం నిర్మించిన క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. పూజా కైంకర్యాలు, భక్తుల గోత్రనామాలలతో నిత్యం పూజలు చేస్తూ ఈ ప్రాంత వాసులు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో పెంట వంశానికి చెందిన అర్చకులు ఆలయ నిర్వహణ కొనసాగిస్తున్నారు. వారి కోసం ఆలయానికి ఆనుకొని గతంలో ఇళ్లు నిర్మించారు. ప్రస్తుతం ఇవి నివాసయోగ్యంగా లేవు. పైకప్పు కారిపోతోంది. గోడలు పెచ్చులూడిపోతున్నాయి. ఎండకు వానకు తడిసి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. ఇప్పటికే ఓ ఇంటి పైకప్పు కూలిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో స్వామినే నమ్ముకొని ఆ గదుల్లోనే అర్చకులు కాలం వెళ్ల బుచ్చుతున్నారు. దేవదాయశాఖ అధీనంలో ఉన్న ఈ పురాతన ఆలయాన్ని నమ్ముకొని పెంటవంశంలో ఐదు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆధునీకరణ చేసేందుకు దేవదాయశాఖ ముందుకు వస్తే.. ఇక్కడి భక్తులు కూడా తమవంతు సాయంగా ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి పాత ఇళ్లను నివాసయోగ్యంగా మార్చాలని అర్చకులు కోరుతున్నారు.

అధికారులు స్పందిస్తే..



శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలోనే కుటుంబాలతో కలిసి జీవిస్తున్నాం. దేవదాయశాఖ అధికారులు ముందుకు వస్తే స్థానికుల సహకారం తీసుకొని వాటిని మళ్లీ పునరుద్ధరణ చేపడతాం. ఈ ఆలయాన్నే నమ్ముకొని కొన్నేళ్లుగా నివాసముంటున్నాం.

– పెంట రాజశేఖరశర్మ, అర్చకులు, ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయం

ప్రైవేటు గుప్పిట్లోకి.. ప్రభుత్వ వైద్యరంగం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పీపీపీ పద్ధతి వల్ల ప్రభుత్వ వైద్యరంగం ప్రైవేటు గుప్పెట్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని వక్తలు హెచ్చరించారు. ప్రభుత్వ వైద్యకళాశాలలు – ప్రైవేటీకరణ అనే అంశంపై 'ప్రజారోగ్య వేదిక – గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం' సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ప్రజారోగ్య వేదిక కన్వీనర్ డాక్టర్ మల్లేశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ ఉండాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలు కేటాయించిందన్నారు. నిర్మాణానికి రూ.8548 కోట్లు కేంద్రం ఆమోదించగా, కేవలం నాలుగేళ్లలో రూ.2225 కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధానం ఎంతో గొప్పదని, ప్రజలను నమ్మబలికే ప్రయత్నం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రైవేటీకరణ కాదని ప్రభుత్వ అజమాషీలోనే కొనసాగుతాయని నమ్మబలుకుతోందని, వాస్తవానికి ఈ కొత్త కళాశాలల్లో కన్వీనర్ కోటా కుదించడం తోపాటు జనరల్ కేటగిరీ సీట్లకు భారీగా ఫీజులు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకించి అధికారంలోకి వచ్చాక ఇలా చేయడం అన్యాయమన్నారు. నిర్మాణం పూర్తికాని కళాశాలలను, ఆసుపత్రులను కూడా ప్రభుత్వమే పూర్తి చేసి నిర్వహిస్తుందని వాగ్దానం చేసి ఇప్పుడు పీపీపీ పద్ధతులేంటని ప్రశ్నించారు. భవిష్యత్తులో కన్వీనర్ కోటా సీట్లు తగ్గిపోయి, ఖరీదైన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు పెరగబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సామాన్య, పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులు మంచిర్యాంకులు సంపాదించినా భారీ ఫీజులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. వైద్యరంగంలో సేవా దృక్పథం తగ్గిపోయి వ్యాపార దృక్పథం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగంలో వైద్యుల కొరత ఏర్పడుతుందని, ఆరోగ్యాన్ని హక్కుగా పొందే అవకాశం తగ్గిపోతుందన్నారు. తక్షణమే పీపీపీ విధానాన్ని వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్యవేదిక కన్వీనర్ కామేశ్వరరావు, మాజీ కార్యదర్శి డాక్టర్ సత్యానంద్, రైతు సంఘం నాయకులు కె.మోహనరావు, ప్రజారోగ్యవేదిక నాయకులు డాక్టర్ కన్నేపల్లి శ్రీనివాస్, గరిమెళ్ల విజ్ఞానకేంద్రం అధ్యక్షులు ఎం.ప్రభాకరరావు, పి.సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్, వాసు, చందు, రాజు, సాహితీ స్రవంతి నాయకులు నెట్టిమి రమణ, గోవర్ధనరావు, డి.రమణారావు, శ్రీనివాసరావు, ఎం.ఆదినారాయణమూర్తి, జర్నలిస్టుల సంఘం నాయకులు సత్తారు భాస్కరరావు, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణోత్సవం



తాళిబొట్టును భక్తులకు చూపిస్తున్న అర్చకులు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం అరసవల్లిలో సూర్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం శనివారం ఘనంగా జరిగింది. జ్యేష్ట బహుళ ఏకాదశి సందర్భంగా ఉషా పద్మిని ఛాయాదేవేరులతో శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ, వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతు పూర్తి చేశారు. కల్యాణ సేవలో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలతో పాటు తీర్థప్రసాదాలు, తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో శ్రమదోపిడీ చేయిస్తూ అరకొర జీతాలిచ్చి వారి జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకోవడం సరికాదని సంఘ నాయకులు మండిపడ్డారు. సమ్మెలో భాగంగా 38 రోజులుగా నిరసన తెలియజేస్తున్న కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ మేరకు శనివారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం పైకి ఎక్కి వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులు దాదాపుగా 16 వేల మంది కార్మికులు నిరసన తెలియజేసిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. జీవో నెంబర్ 7 ప్రకారం టెక్నికల్ కార్మికులకు రూ 29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేలు చెల్లించాల్సి ఉన్నా.. రూ 15వేలు మాత్రమే అందిస్తూ కార్మికులను తీవ్రంగా మోసగిస్తున్నారని దుయ్యబట్టారు. 15 ఏళ్ల సర్వీసు కలిగిన కార్మికులు అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన, శాశ్వత అంగవైకల్యం పొందిన కార్మికుల రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని కోరారు. కార్మికులకు ఎటువంటి షరతులు లేకుండా అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించిన ఎనిమిది గంటల నుంచి పది గంటలకు పెంచే జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం దారుణమన్నారు. వీటి వల్ల కార్మికుల హక్కులు నిర్వీర్యమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం మోదీ కార్మిక వ్యతిరేక విధానాలను మించి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేయడానికి పని గంటలు పెంచే జీవోలు తీసుకొస్తోందని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అధ్యక్షుడు శ్యామలరావు, కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్వచ్ఛభారత్



కాంప్లెక్స్ ఆవరణను పరిశుభ్రం చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది



మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కాంప్లెక్స్‌లోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. వ్యర్థాలను పోగుచేసి తగులబెట్టారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ మాట్లాడుతూ కాంప్లెక్స్‌కు నిత్యం ఎంతో మంది ప్రయాణిస్తుంటారని, ప్రయాణికులు తమ వెంట తెచ్చుకున్న తినుబండారాల కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్ తదితరవి ఎక్కడపడితే అక్కడ పడేయకుండా కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల సీఐలు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎం ఎం.పి.రావు, ఆర్టీసీ అధికారి ఎఎన్ఎస్ శ్రీనివాస్, రాజు, పీఆర్‌వో కె సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.